# ప్రబోధ 32

భవ్యభావాల కూడిన భారతంబు
దివ్యసంస్కృతి తత్త్వంబు తెలుసుకొనగ
భారతీయులు యత్నింపనేర్వారిరి
ఇంతకంటెను దౌర్భాగ్యమేమికలదు.

దివ్యాత్మస్వరూపులారా!

భారతీయులు స్వతంత్ర్యమును పొందగల్గిరిగాని ఐకమత్యమును సాధించలేకపోతున్నారు. ఐక్యత లేని స్వాతంత్ర్యము కరెంటులేని వైరువంటిది. భారతీయుల దివ్యపవిత్రమైన సనాతన ధర్మము ఇది ఉత్కృష్టమైనది, సౌజన్యమైనది, సౌశీల్యముతో కూడినది. అవతారములకు యిది ఆటుపట్టు. ఋషులు, మునులు, యోగులు, వీరులు, ధీరులు, శూరులు పతివ్రతావంతల్లులకు యిది పుట్టినిల్లు. మబ్బులు కప్పిన సూర్యుడు కొంతకాలము కన్పించకపోవచ్చును. కానీ సూర్యుడు లేడనుటకు వీలులేదు. అదేవిధముగనే కొన్ని సాంప్రదాయములు కొన్ని ఆధునిక పద్ధతులనే మేఘములు అడ్డగించుటం చేతనే భారతీయ సంస్కృతి కొంత మరుగైనది కాని దీనికి యేనాటికిని నాశము లేదు. ప్రతీయుగమునందు యిట్టి మహాపురుషులు అవతరిస్తూనే వున్నారు. ఇట్టి మహాపురుషులు అవతరించని యుగమే లేదు భారతదేశములో.

విదేశీయులు భారతదేశముపైన సహస్రనేత్రములతో చూస్తున్నారు. కేవలము భారతీయుల యొక్క సిద్ధాంతమే కాక ఆధ్యాత్మిక తత్త్వముపైన యనేకవిధములైన ఆశలు కల్పించుకొని విదేశీయులు దీనిని ఆశ్రయిస్తూ వస్తున్నారు. కానీ భారతీయులు వారసత్వమైన యీ సంస్కృతిని భారతీయులే తొలగించుటకు ప్రయత్నిస్తున్నారు. ఇదే విచిత్రమైన వైపరీత్యము. నిజముగా భారతీయ సంస్కృతిని యిట్టిది, అట్టిది అని వర్ణించుటకు ఎవ్వరితరము కాదు. కనుక యీనాడు భారతీయులు లౌకికమైన భోగభాగ్యముల నాశించి దివ్యమైన, నవ్యమైన, భవ్యమైన మన సంస్కృతిని విమర్శిస్తూ వస్తున్నారు. క్షణభంగురమైన యీ భౌతిక సంపదలు అవసరమే. కాని భౌతిక సంపదలతోపాటు ఆధ్యాత్మిక సంపదనుకూడను మనము అభివృద్ధిగావించినప్పుడే తిరిగి మనము యితరదేశీయులకు కొంత ఆదర్శాన్ని అందించినవారమౌతాము. దురదృష్టవశాత్తు యీనాడు భారతీయసంస్కృతిని ప్రభుత్వము కూడను విస్మరించి దానికి విరుద్ధమైన మార్గములను అవలంబిస్తున్నారు. వీరి యొక్క భాషణలు, ఆదేశములు గంభీరముగావుండవచ్చు. కానీ వీరి దృష్టి అంతయు పాశ్చాత్యుల నాగరికత

పైనే అభివృద్ధి అవుతున్నది. భారతీయులు కూడను యీ యొక్క నాగరికతపై కొంత దృష్టిని అభివృద్ధిపరచి, లక్ష్యమంతయును దానియందే అభివృద్ధి పరుస్తున్నారు. ఇది గొప్ప దురదృష్టము.

మండెడు కాంతితో మేరు పర్వతముండ
వెండి బంగారులకై వెదుకనేల
కోరిన ఫలమిచ్చు కల్పవృక్షంబుండ
పెరటి పుష్పములకై ప్రీతియేల
అడిగిన పాలిచ్చు కామధేనువుండ
ధనమిచ్చి ఆవును కొనగనేల

. భారత దేశమునందు లేనిది మరియే దేశమునందు కన్పించదు. ఇట్టి సర్వకళ్యాణములతో, సర్వగుణములతో, సర్వశక్తులతో యిమిడి వున్న యీ భారత దేశాన్ని విస్మరించి కేవలము యీ భారతదేశము అనితూలనాడటము, భారతదేశాన్ని హాస్యాస్పదముగా చూచుకొంటము, భారతీయసంస్కృతి విస్మరించి కొంత వరకు దీనిని విమర్శించటానికి ప్రయత్నించటము యిది భారతీయుల యొక్క దురదృష్టము.

. నిజముగా భారతీయులయొక్క మహా భాగ్యమనేది యింత అంత అని చెప్పుటకు వీలుకాదు. కాని దానిని అనుభవించటానికి యోగ్యతకూడను అత్యవసరము. పాండిత్యము వుండవచ్చును. విద్యావంతుడు కావచ్చును. శక్తివంతుడుగా వుండవచ్చును. కానీ యిన్ని బలములుండికూడను ఆధ్యాత్మిక బలమే లేనప్పుడు యిది నిరుపయోగమనే తోస్తుంది.

వేదశాస్త్రములు వివరించి బుధులచే
చదివించవచ్చు తా చదువవచ్చు
యజ్ఞయాగ తపము లధికారి జనులచే
చేయించవచ్చు తా చేయవచ్చు
ఇలలోన గల తీర్థములకేగ నన్యుల
బోధించవచ్చు తా పోవవచ్చు
అష్టాంగయోగ విద్యలార్థులకును బోధ
సలుపంగవచ్చు తా సలుపవచ్చు

కానీ దేహేంద్రియములనరికట్టి, మనసునిల్పి ఆత్మతత్త్వము పొందేది యెవ్వరికి సాధ్యముకాదు. దాని తత్త్వమును గుర్తించినవారికే భారతీయులయొక్క మహాభాగ్యమును గుర్తించటానికి అధికారులౌతారు.

భారతదేశీయులందరు కూడను ఒకతల్లి బిడ్డలే. దేశభాషలు వేరుకావచ్చును కానీ అందరు ఒకే కుటుంబానికి చెందినవారే. భారతీయులందరికి కూడ ఒక్క

223118703

మానవజాతియే. ఈ జాతికి ప్రభువు ఒక్కడే భగవంతుడు. అట్టి భగవంతుని యొక్క అనుగ్రహానికి పాత్రుడు కావలెనంటె, నీ పదవులు, నీ విద్య, నీ యుక్తి, నీ యోగములు యే మాత్రము పనికి రావు. అతడు కేవలము ఒక్క ప్రేమకు మాత్రమే బద్ధుడౌతాడు. కారణమేమనగా భగవంతునికి ప్రేమ స్వభావము. అట్టి ప్రేమ స్వరూపుడైన భగవంతుని ప్రేమ ద్వారానే మనము పొందగలము గానీ అన్యమార్గములో అతను లభ్యము కాడు. మానవుని యందు కూడను ప్రేమ వున్నది. ఆ ప్రేమ చేతనే భగవత్ప్రేమను సంపాదించి ప్రేమ తత్వము నందు ప్రేమాత్మను కలిపి ప్రేమమయుడుగా తాను జీవించాలి. కేవలం ఉద్యోగముల చేతను, వ్యాపారముల చేతను ధనము మనము సంపాదించుకుంటాము. ఈ ధనమంతా కూడను అనిత్యమైనది. నిత్యమైన సత్యమైన ఆధ్యాత్మిక ధనమును మనము సంపాదించటానికి, ప్రేమ ద్వారానే మనము పరమాత్మను ఆస్వాదించి అనుగ్రహాన్ని పొంది యీ ప్రేమ ధనమును మనము సంపాదించుకోవాలి.

ప్రేమ ఒక దిక్సూచి యంత్రము వంటిది. అయితే యీ దిక్సూచి యెక్కడ పెట్టినప్పటికిని అది ఉత్తర దిక్కు యందే తన ముల్లు చూపుతుంది. అదే విధముగనే పరమభక్తుడైన మానవుని దృష్టి యేమి చేసినా యేమి చూచినా, యేమి చెప్పినా, యేమి తలచినా అది భగవంతుని పదమునే పట్టును తుంది. అట్టి దివ్యప్రేమను మాత్రము మనము తనది పరది అనే భేదము లేకుండా మనము పాటించాలి. ఈ పరమభక్తి అనేది కేవలము ఒక సూటైన కత్తి వంటిది. దీనికి తన, పర అనే భేదములు లేవు. అలాంటి దివ్యతత్వమైన ప్రేమ తత్వాన్ని మనము యీనాడు అర్థం చేసుకోటానికి యే మాత్రం కూడను ప్రయత్నించటంలేదు. భగవంతుడు పరమ ప్రేమస్వరూపుడు. ఆ ప్రేమను అర్థం చేసుకోటానికి కొంత శక్తి కావాలి. దానికి అర్హత వుండాలి. అప్పుడే యీ ప్రేమను సరైన రీతిలో అర్థం చేసుకోటానికి వీలవుతుంది. కాని తన భావము బపురస్కరించుకొని భగవంతుని ప్రేమను కూడను తన భావములతో కూర్చుకున్నప్పుడు అది కేవలం ఒక విపరీతార్థముగా రూపొందుతుంది. దివ్యమైన ప్రేమతత్వము వ్యర్థమైనది కాదు. ఈ ప్రేమనే అహంకారపరమైనప్పుడు వికృతమవుతుంది. ఇదియే ఆత్మపరమైనప్పుడు సుకృతమౌతుంది. కనుక ఆత్మభావమే ప్రతి మానవునకు అత్యవసరము.

ఈనాడు మనము చేసే సర్వసాధనలు ఆత్మాన్వేషణ కోసమని భావిస్తున్నాము. అది చాలా పొరపాటు. అన్వేషణ చేయవలసినది కాదు ఆత్మ. సర్వత్రా వున్నది అదియే. చూసేవాడూ తానే. చేయించుకొనేది తానే. సర్వప్రపంచము ఆ యొక్క ఆత్మస్వరూపమై వున్నది. ఆత్మ అనే పదార్థము మరొకటి లేదు జగత్తులో. ఆత్మదృష్టి లేనప్పుడే అనాత్మ అనే భావము యేర్పడుతుంది. కనుక మన దృష్టిని మరల్చుకోటమే కాని మరొకటి కాదు యీ ఆత్మాన్వేషణ. దృష్టి అనగా కేవలము నేత్రములతో చూచే దృష్టి కాదు. నేత్రములు దేని ఆధారముతో చూచుచున్నవో అట్టి ఆధారాన్ని పురస్కరించుకొని విచారించటమే యిది ఒక

223118704

అంతర్దృష్టి. కనుక యీ కన్నులచేత చూచే వాడు ఎవడో అతనిని చూడటానికి ప్రయత్నించాలి. ఈనాటి ప్రతి సాధన కూడను కేవలం మానసికంగా చేస్తున్నాము. సమస్త సాధనలకు మనసే అధిపతిగా వుంటున్నది. ఈ సాధనలను మనసు అధిపతిగా వుండినంతవరకు వీడు గమ్యాన్ని యే మాత్రం అర్థం చేసుకోలేడు. చేరలేడు. దొంగ యేనాటికైననూ తనను తాను పట్టించుకుంటాడా. మనసు ఒక దొంగవంటిది. ఆ దొంగను ఆశ్రయిస్తే తాను తిరిగి దొరగా మారటానికి వీలవుతుందా. కనుక మనసును మనం ఆశ్రయించకూడదు. మరి యే విధముగా యీ ఆత్మను దర్శించాలి. మనసును మరిస్తే వున్నది ఆత్మనే. కనుక మనోనిగ్రహం కాదు మనం చేయవలసినది. ఆత్మదృష్టిని మనం అభివృద్ధిపరచుకున్నప్పుడు మనసు సహజముగా దూరమవుతుంది. మనసు అదృశ్యమైపోతుంది.

ఇట్టి మహాభాగ్యమును పొందే నిమిత్తమై యనేకమంది ఉపదేశములు, ఉపదేశములని ఆశిస్తూ వుంటారు. ఉపదేశమనగా యేమిటి? ఓం నమః శివాయ, ఓం నమో నారాయణాయ యిలాంటి పదములుచ్చరించినంత మాత్రమున ఉపదేశమౌతుందా? ఉపదేశమనగా స్వస్థానమునకు సమీపించటమే ఉపదేశము. తనస్థానమునకు సమీపంగా చేర్చటమే ఉపదేశము. కేవలము నామముల చేత ఉచ్ఛరించినంత మాత్రమున ఆయన సమీపానికి మనం చేరలేము. ఇప్పుడు రామ, కృష్ణ, గోవింద, నారాయణ అనే నామములు వుచ్ఛరిస్తున్నాము. ఇవన్నీ పెట్టిన పేర్లే కాని పుట్టిన పేర్లు కావు. కనుక మనము పెట్టిన పేర్లను మటుకే ఆధారం చేసుకున్నప్పుడు పెట్టినవి యేనాటికి స్థిరమైనవి కావు. పుట్టినవి అంతకంటె స్థిరము కావు అన్నింటికంటె మొట్టమొదట పుట్టినది యేదంటే నేను, నేను, నేను అనేదే. మొట్టమొదట యీ నేను అనే సంకల్పాన్ని గుర్తించుకోటానికి ప్రయత్నం చేసినప్పుడు సర్వము గుర్తించుకున్నవాడౌతాడు. ప్రణవము కూడను నేను అనే సంకల్పము పుట్టిన తరువాతనే పుట్టినది కాని ప్రణవము మొదటి శబ్దము కాదు. అన్ని సంకల్పములకంటె మొట్టమొదట నేను అనే సంకల్పము పుట్టిన తరువాతనే నీవు అతనే సంకల్పాలు, మిగిలిన సంకల్పాలంతా ఆవిర్భవిస్తున్నాయి. కనుక తాను తాను మొదట నేనెవరు నేనెవరు అనే సత్యాన్ని గుర్తించుకోవాలి. నేను బ్రహ్మ నేను బ్రహ్మ అని నిర్ణయం చేసుకోవచ్చు. అయితే అక్కడ కూడను నేను, బ్రహ్మ అక్కడ కూడను ఒక నేను వున్నది కదా. ఆ నేనెవరో తెలుసుకొన్నప్పుడు బ్రహ్మ అర్థమవుతుంది.

ఈనాడు భౌతికమైన, లౌకికమైన సాధనలందే మనము కాలాన్ని వ్యర్థముగావించుట యిది సరైన సాధన కానేరదు. సర్వత్రా వున్నది ఒక దైవత్వమే. లౌకికము, ఆధ్యాత్మికము అనేవి రెండు లేవు. ఆధ్యాత్మికము యొక్క అంగమే యీ లౌకికము. అగ్నిజ్వాలల నుండి యేర్పడిన కణములే యీ అగ్నికణములు. ఈ జ్వాలనే దైవము. అతని నుండి వచ్చిన జీవులే యీ యొక్క కణములు. అగ్నికి యే గుణములుంటున్నవో ఆ జ్వాలలకు కూడా అదే గుణములుంటున్నవి.

కనుకనే బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి అనే సత్యాన్ని గుర్తించటానికి యిందులోనే మనము సరైన అర్థాన్ని
తెలుసుకోవచ్చు.

తత్త్వమసి అనే మహావాక్యముంది. ఏది నీవుగా వున్నావు. అది యేదో నీవు అర్థం
చేసుకుంటే కదా నేనుగా వున్నానని చెప్పటానికి అధికారివి అవుతావు. ఒక విత్తనముంది. ఆ విత్త
నము మొక్కగా యేర్పడింది. మొక్క వృక్షంగా మారింది. ఈ వృక్షములో ఆకులు, పువ్వులు, ఫలములు
యేర్పడినాయి. అయితే యీ ఆకులు, పుష్పములు, ఫలములు, కొమ్మలు, రెమ్మలు అన్ని కూడను తత్త్వ
మసి ఆ బీజమే మేము అని చెప్తున్నాయి. అయితే యీ వృక్షము, పుష్పము, ఫలము, కాయలు
అన్నీ కూడను యేర్పడాలంటే యేది ఆధారము అదే ఒక బీజము. బీజము బీజముగా వుండి
నంతవరకు వృక్షముగా మారటానికి వీలుకాదు. బీజము తన రూపాన్ని త్యాగము చేసినప్పుడే అది
ఒక మొక్కగా మారి వృక్షంగా మారుతున్నది.

కనుక సర్వదుఃఖములకు, సర్వ అనర్థములకు యీ దేహభ్రాంతి యే మూలకార
ణము. ఈ దేహభ్రాంతి అనేదే బీజము యొక్క భ్రమ. దానియందే సర్వమూ వుంటున్నది. అయితే
దీనిని దేహంగా మనము భావించుకొని యీ భ్రాంతిలోనే యెంతకాలమైనా మనము మునిగి వున్నం
తవరకును యీ ఆనందమనే ఫలాన్ని మనము అందుకోలేము. దేహభ్రాంతిని త్యాగము చెయ్యాలి.
జీవవృక్షంగా అభివృద్ధి కావాలి. జ్ఞానఫలముగా రూపొందాలి. అప్పుడే ఆనందమనే భాగ్యం మనకు
లభ్యమౌతుంది. కనుక మనము నకర్మణా న ప్రజా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానసుః అని.
కేవలం ధనము వల్లకాని లోకసంపద వల్లగాని యింకే విధమైన త్యాగం వల్లగాని, కర్మల వల్ల
గాని యీ దైవత్వమనే అమృతత్వము మనకు ప్రాప్తించదు. నేను సాధన చేస్తున్నాను, నేను భ
క్తుడుగా వుంటున్నాను, నేను మహావాక్యాలనంతా అర్థము చేసుకున్నాను అనుకున్నంతవరకు
వాడు అజ్ఞానియే. తనకు తాను పెట్టుకొన్న పేర్లేగాని మరొకటి కావు. తాను తానుగా వున్నాననే
అర్థాన్ని గుర్తించిన వాడే మహాజ్ఞాని. అహంకారము వుండినంతవరకు ఆత్మసందర్శనము
చేయలేడు. అహంకార నిర్మూలనం గావించి ఆచరించే కర్మలే అకర్మలుగా మారతాయి. కనుకనే
పరమ పవిత్రమైన ప్రేమ తత్త్వాన్ని మనము అనుసరించాలి. ఈ ప్రేమ తత్త్వముకంటె సులభమైన
ది మరొకటి లేదు. అందరిని ప్రేమించాలి. ఈ ప్రేమలో వుండిన మహాపటుత్వమైన శక్తి అదియే.
ఈ ప్రేమ చేతనే ఐకమత్యం చేకూరుతుంది. ఏకత్వం ప్రాప్తిస్తుంది. ఈనాడు జగత్తులో కన్పించే
భిన్నత్వములన్నీ కూడను యేకత్వము యొక్క అంశములే. కనుక అన్ని భిన్నత్వములకు
యేకత్వమే మూలాధారము. అట్టి మూలాధారమైన తత్త్వాన్ని మనము గుర్తించినప్పుడు మనము
యేమాత్రము విచారించనక్కరలేదు.

కనుక భారతీయులు మున్ముందు సాధించవలసినది ఏకత్వము అదే ఐక
మత్యము. ఐకమత్యము లేనిదే యే చిన్ని కార్యమును కూడను మనము సులభముగా సాధించ

లేము. 78 కోట్ల ప్రజలంతా భారతదేశములో వుంటుండి ఒకరికొకరు కించిత్తైనా కూడను సంబంధ బాంధవ్యము లేకుండా జీవిస్తున్నారు. ఏ వ్యక్తిని చూచినప్పటికిని స్వార్థము, స్వప్రయోజనము, కులము, మతము యీ వర్గ భేదములు పూర్తిధ్వంసము చేయాలి. ఎవరిది యే కులము కాదు. మానవకులము మానవజాతి. నేను బ్రాహ్మణుడను, నేను క్షత్రియుడను, నేను వైశ్యుడను నేను శూద్రుడను అనుకోటము యీ దేహభ్రాంతి వల్లనే కల్గినవి కదా!. నేను బాలుడను, నేను యువ్వనుడను, నేను వృద్ధుడను, నేను పురుషుడను అనుకోటం కూడా దేహభ్రాంతే. స్త్రీలు, పురుషులు అక్కడా వుంటున్నారు, యిక్కడా వుంటున్నారు. నీవు నేను పురుషుడనని ఉచ్ఛరిస్తున్నావు. ఈ పురుషుడను అని అనటానికి ఆధారమేమిటి? దేహభ్రాంతి వల్లనే నీవు పురుషుడనని అంటున్నావు. వారు దేహాకారం చేతనే వారు స్త్రీలంటున్నారు. ఇవి దేహాలతో అంటగట్టుకొన్నవే గాని సరైన సత్యములు గావు. దేహభ్రాంతి వుండినవానికే యీ భేద భావములంతా కూడను అతనిని అరికట్టుతూ వున్నవి. భగవంతుని వరప్రసాదములైన పంచభూతములకు యే కులమంటున్నది. నీటి దే కులము? నిప్పు దే కులము? గాలి దే కులము? గగనమున దే కులము? ఇవి అందరికి సమానమే కదా. ఇలాంటి యేకత్వాన్ని మన మెందుకు భావించకూడదు, అభివృద్ధి గావించకూడదు. కనుక మన జీవితమంతయు కూడను దేహభ్రాంతిలోనే, దేహ ఆశలతోనే మనము అంకితము గావించుకుంటున్నాము. వ్యక్తిగతమైన భావములెన్నైనా పెట్టుకోవచ్చు. కానీ సమిష్టి స్వరూపమైన దేశతత్త్వము లోపల మన మందరము అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రనే సత్యభావాన్ని గుర్తించాలి.

ఇలాంటి ఏకభావము మనలో యేర్పడవలెనంటే మనము సేవలలో పాల్గొనాలి. దేహము వచ్చింది. కాని యిది యెందుకోసం వచ్చింది. దీనిని చక్కగా విచారించాలి. నిజంగా మనం యోచన చేస్తే దేహము ఒక విస్తరాకువంటివి. ఆ విస్తరాకుపైన రుచికరమైన పదార్థములు పెట్టుకొని మనము భుజించి, ఆనందించి తదుపరి నిర్లక్ష్యంగా ఆ యొక్క విస్తరాకును పారవేస్తాము. అదే విధముగనే యీ దేహమనే విస్తరియందు సద్గుణములు సదాచారములు, సత్ప్రవర్తనలు అనే ఫలాహారాలంతా పెట్టుకొని దానిని మనము అనుభవించి ఆనందించి, పదిమందికి, అందించి, తదుపరి యీ దేహమనే విస్తరిని నిర్లక్ష్యంగా విసరి పారవేయాలి. అయితే విస్తరి కలదు కదా అని అసభ్యమైన పదార్థములంతా అందులో వుంచుకొని మనం ఆరగించటానికి ప్రయత్నిస్తామా. మంచి మంచి పదార్థములే మనము భుజించటానికి ప్రయత్నిస్తాము. రుచికరములైన పదార్థములే మనము ఆశిస్తాము. ఆరోగ్యమును అందించే పదార్థములే మనము విశ్వసిస్తాము. కనుక మనము యీ దేహము అనే విస్తరియందు పవిత్రమైన గుణములను మనము వర్ధించుకోవాలి. పవిత్రమైన భావాలు మనము ఆరగించాలి. దివ్యమైన తత్త్వాలు యిందులో మనము అనుభవించాలి. దేహమున్నది కదా యని యిష్టము వచ్చిన

పనులు మనము చేయరాదు తలవున్నదికదా అని అనవసరమైన విషయాలలో మనము ప్రవేశించరాదు. కనులున్నవికదా అని యనేక విధములుగా మనదృష్టిని పాడుచేసుకోరాదు. చూడవలసిన దృశ్యములు మాత్రమే మనము చూడాలి. చూడరాని విషయములు మనము యేమాత్రము కూడను చూడరాదు. చేతులతో మంచి పనులు మాత్రమే చేయాలి. ఇలాంటి పవిత్రమైన కర్మలచేతనే యీ జీవితాన్ని సార్థకము పవిత్రముగావించుకోవాలి.

ప్రేమస్వరూపులారా! అమితంగా మీరు ఆలోచనలు సల్పి కాని, విచారణలు చేసి గాని యీ ఆధ్యాత్మిక మార్గములో మీరు ప్రవేశించటానికి ప్రయత్నించరాదు. భారతీయుల యొక్క సంస్కృతి, మూఢనమ్మకములతో కూడుకున్నది కాదు. ఇది యనేక విధములైన సాధనలు సల్పి, పరిశోధనలు చేసి, అనేక మహర్షులు అనుభవించి, ఆనందించి పదిమందికి పంచి పెట్టిన పదార్థములు. ఇవి వేదశాస్త్ర యితిహాస పురాణములనుండి పవిత్రమైన క్షీరమనే దానిని తీసి యిందులో ఒకవిధమైన వెన్నముద్దగా అందుకొన్నది భారతదేశము. భారతదేశము మట్టిముద్దగాని, మాంసపుముద్దగాని కాదు. ఇది అమృతపుముద్ద. ఆనందపుముద్ద. సర్వశాస్త్ర యితిహాసముల సారమైన వెన్నముద్ద. ఇలాంటి పవిత్రతను మనము విచారించటానికి ప్రయత్నించక, ఏదో తనకు తోచిన రీతిగా మనము యోచించటము వానిని విశ్వసించటము, అనుసరించటము యిది మానవునికి సరైన కర్తవ్యము కాదు. భగవంతుడు సర్వత్రా, సర్వులయందు వుండటంచేత అతను యేపనైననూ చేయవచ్చును. భగవంతుడైతే యిదిచేస్తాడా అదిచేస్తాడా అట్లావుంటాడా యిట్లావుంటాడా అని విచారించి నిర్ణయించే శక్తి ఎవరికీ అధికారములేదు. భగవంతుడు యేమైనా చేయవచ్చు.

కన్నీరు తెప్పించు కన్నీరు తప్పించు
జోగి భోగిగ జేయు భోగి జోగిగ జేయు
పిచ్చిని పట్టించు పిచ్చిని పోగొట్టు
పుట్టించు రక్షించు హతమొనర్చు.

తనకు యేవిధమైన సంకల్పము చేత, ఏకార్యమునందు యేవ్యక్తిని, ఎప్పుడు, యెక్కడ, యెట్లా ఏవిధముగా మనము చర్చించాలన్నది దైవానికి తెలుసు. దైవము యివే చెయ్యాలి అవే చెయ్యాలి అని నిర్ణయించే అధికారము యెవ్వరికి లేదు. హిరణ్యాకశిపుడున్నాడు. ప్రహ్లాదుడున్నాడు. ప్రహ్లాదుని రక్షించాడు. హిరణ్యాకశిపుని శిక్షించాడు. అతని ప్రారబ్ధము, అతని యొక్క సంచితము, అతని యొక్క ఆగామిని పురస్కరించుకొని, ఆకాలమునకు, ఆశాపమునకు, ఆపరిస్థితులు అనుగుణముగా భగవంతుడే అన్ని విధములా నటన చేస్తాడు.

విశ్వంవిష్ణుస్వరూపము. సర్వత్రా వుండిన భగవంతుని యొక్క స్వార్థము అనే రూపములో చూసినప్పుడు యిది భిన్నముగా రూపొందుతుంది. భగవంతునికి స్వార్థము

న్నదే లేదు. స్వార్థము లేని భగవంతుడు యేపని చేసినాగాని అది పరార్థమే. అది పవిత్రమే. అది ధర్మమే. కనుక యిట్టి సత్యస్వరూపమైన దైవత్వాన్ని యిట్టిది అట్టిది అని నిర్ణయించే అధికారము యివ్వరికిని లేదు. వేదములు కూడను యినేక విధములుగా పరిశోధనలు చేసి శాస్త్రపరిజ్ఞానము ను యినేక విధములుగా పరిశోధనలు చేసి కడపటికి నేతినేతి యిదికాదు యిదికాదు అనే మార్గము వరకు పోయేరే గాని ఇది అనేది యెవరికి చెప్పటానికి అధికారము లేకుండాపోయింది.

జగత్తంతకి కూడను పాత్రధారి, సూత్రధారి తానే, నేరూపములో కూడను అతనొక పాత్రధారిగా నటన చేస్తున్నాడు. అనేది తానే, అన్పించుకొనేది తానే, తిట్టేది తానే, తిట్టించుకొనేది తానే. ఏడ్చేది తానే, ఏడ్పించేది తానే. ఇలాంటి భగవంతునికి యేదని మనము నిర్ణయించటానికి వీలవుతుంది. అయితే దైవత్వానికి ఒక్కటిమాత్రమే ప్రేమతత్వము, ఆకర్షించే ప్రేమతత్వము ఉంటుంది. ఈ ఆకర్షణ అందరికి వుండటానికి వీలుకాదు. సముద్రమునకే, విశాలమైన అనంతమైన, అగాధమైన లోతు వుంటుంది. దానినుండి తెచ్చుకున్న టంబ్లరు వాటరకు దానియొక్క విశాలత వుంటుందా. సముద్రము యొక్క రుచి వుండవచ్చుగాని యీనీరు సముద్రము కానేరదు. అదేరీతిగా జీవులుగా వుండినవారికి వారివారి శక్త్యానుసారము, వారివారి సంస్కారమునను సరించి అవి వుండవచ్చునే తప్ప అంతకంటె అధికంగా వుండటానికి వీలులేదు.

ఒకానొకప్పుడు లక్ష్మణుడు, సీత అందరు కూడ సందేహిస్తున్నట్లుగా నటన చేశారు. వీరందరియొక్క పరిస్థితులను పురస్కరించుకొని, వారిప్రవర్తనలను పురస్కరించుకొని త్యాగరాజుకు కూడా కొంత సందేహము ఆవిర్భవించింది. ఇన్నివేలమంది, యిన్నిలక్షల జనములంతా ఆకర్షించటానికి యితనిలో యేదో ఒకటివుండాలికాని అదిలేకపోతే యిన్నివేలమంది రావటానికి వీలులేదుకదా. యీనాడు యిన్నివేలమంది యిక్కడ చేరారు. ఎవరికైనా invitation అందించామా. రమ్మని జాబులేమైనా వ్రాశామా లేక పేపర్లో ప్రకటనవేశామా. కాదు. కాదు. ఆప్రేమ యొక్క ఆకర్షణే దీనికి మూలకారణము. కనుకనే త్యాగరాజు చెప్పాడు.

లేకనా నిన్నచుట్టుకున్నారు
శ్రీకర కరుణాసాగరుడనినిన్ను
చిన్మయరూపా చింతామణి నీవెగా...

కరుణాసాగరమనే చింతా మణి నీదగ్గరలేకపోతే యింతమందిని నీవు ఆకర్షించే యిది వుంటుందా. కనుక ఆ చింతామణి నీదగ్గరలేకపోతే యిందరు చేరటానికి వీలవుతుందారామా! అన్నాడు. అట్టి ప్రేమ చింతామణి యిక్కడ వుండటంచేత యింతమంది యిక్కడ చేరటానికి వీలైంది. ఎవరికితోచినట్లువారు చెప్పవచ్చును. కానీ యెవ్వరైనా సరే యింతమందిని వేలాదిమందిని ఆకర్షించే శక్తిచూపించమనండి. లారీలలో లారీలలో తీసుకువచ్చి అక్కడ దింపినా వుండటానికి వీలుండదు. పరుగెత్తిపోతుంటారు. ఇక్కడ వద్దు వద్దు షెడ్లు కూడా స్థలంలేదని చెప్పినా

223118709

చెట్లుక్రిందైనా వుంటామంటారు కాని వెనక్కిపోటానికి యేమాత్రం అంగీకరించరు. ఇదే నిజమైన హృదయానికి, హృదయానికి సంబంధించిన ప్రేమ. నిర్బంధముగా యెవ్వరు యిక్కడకు రావటానికి వీలుండదు. ఆప్రేమపాశమే వీరందరిని యిక్కడ కట్టివేస్తుంది. అదియే మనకు దైవశక్తి. అందరూ కూడను యీశక్తులు, ఆశక్తులు ప్రదర్శిస్తున్నారని మీరు భావించవచ్చును. మీదృష్టిలో యివి ప్రదర్శనలుగాని నాదినాకు నిదర్శనము. ఇది నాకు సహజము. మీదృష్టికది ప్రదర్శనము. నాసహజాన్ని నేను అనుసరిస్తూపోతున్నాను. అదియే దివ్యమైనప్రేమ సహజము. ఇది అందరికి సాధ్యమయ్యేది కాదు. ఎన్ని శాస్త్రములైనా, ఎన్ని వేదములైనా, ఎన్ని వుపనిషత్తులనైనా, బ్రహ్మసూత్రములనైనా మీరు సాధించి, శోధించి అందుకోండి చూద్దాం. ఏనాటికి యిది సాధ్యంకాదు. ఆప్రేమను ఆధారం చేసుకున్నవారికి మాత్రమే యిది అర్థం అవుతుంది. ప్రేమకు నయాపైసఖర్చులేదు. మీయందు సహజముగానే ఆప్రేమ వుంటున్నది. ఆసహజప్రేమను మీరు అనుభవించటానికి ప్రయత్నం చేస్తే అది మీకు లభ్యమవుతుంది. రామదాసు చెప్పాడు.

రామనామమను మిఠాయి యిదిగో రండి భక్తులారా!
వేదసారమను గోధుమపిండిలో వేదవాక్యమను క్షీరము పోసి
ఆనందమైన పెద్దబాండువ తీసి ఆదిమునులు దీనిని బాగుగ కలిపిరి. ॥రా॥
రుచికరమైనది రామమిఠాయి సకలరోగ నివారణమోయీ
ఒక్క కాసైనను ఖర్చులేదోయి ఆనందముగ మీరు అందుకోండోయి. ॥రా॥

దీనికి యేమాత్రము ఖర్చులేదు. అయితే మీకు వచ్చేపోయే ఛార్జీలు మాత్రమే ఖర్చు. ఆఖర్చు కూడను ఒక పవిత్రమైన ఖర్చే. కనుక యీ పుట్టపర్తి యాత్ర అనేఖర్చుకూడను ఖర్చుకాదు. అది ఒక ప్రాప్తియే. అయితే ఆఖర్చులేక యీప్రాప్తి మీకు లభ్యము కాదు. మనం షాపుకు వెళ్ళి ఒక కర్చీఫ్ కొనుక్కోవాలంటే ఐదు రూపాయలిస్తే కర్చీఫ్ యిస్తాడు. మనం యివ్వందే పుచ్చుకోటానికి అధికారం లేదే. అదే రీతిగా మీరు యేకొంచెమైనా త్యాగం చేసి మీరు యిక్కడికి వచ్చినప్పుడే యీవిధమైన భావమనేది మీకు లభ్యమౌతుంది. ప్రేమ అనేది యిచ్చిపుచ్చుకొనేది. భగవంతుడు యేమి చేసినా, యేమి చెప్పినా, యేమి తలచినా అంతా ప్రజలనిమిత్తమే కాని తన నిమిత్తము కాదనేటువంటి సత్యాన్ని దృఢముగా మీరీనాడు విశ్వసించాలి.

స్వామికి యేకోశాన కూడను స్వార్థమనేటువంటిది లేదు. నమ్మినా నమ్మకపోయినా నాకందరు ఒక్కటే. అయితే వారి వారి ప్రాప్తానుసారము కొంచెము వుంటుంది. సముద్రములో కావల్సినంత నీరు వుంటున్నది. ఎవరు యెంత పాత్ర తీసుకుపోతారో అంతపాత్రకే ఆనీరు లభ్యమౌతుంది. అదేవిధముగా వారి కర్మానుసారముగా, వారి ప్రాప్తానుసారముగా యీయొక్క అదృష్టమనేది లభ్యమౌతుంది. కనుక యీనాడు మనము సత్సంకల్పాలను అభివృద్ధిపరచుకోవాలి. సంకల్పము వల్లనే కర్మ. కర్మవల్లనే సాధన. సాధనవల్లనే శీలము. శీలమువల్లనే ప్రాప్తి.

223118710

అదే అదృష్టము. మన అదృష్ట దురదృష్టములంతా సంకల్పములపైన ఆధారపడివుంటుంది. ఎట్టి సంకల్పమో అట్టి ఫలము. కనుక మన కర్మలను మనము అనుసరించే తీరాలి. అయితే అనుసరిస్తూ కూడను భగవంతుని ఆనందముగా ఆరాధిస్తూ వుంటే యింతకంటె ప్రాప్తి మరొకటి లేదు. మనలో దుర్భావములు, దుర్గుణములు, దురాలోచనలు పెట్టుకొని సద్భావములుగా మనము నటన చేస్తే యిది మాత్రము భగవంతుని వంచించినట్లవుతుంది. ధనములో దాగుడు మూతలాడటానికి యిక్కడ యే మాత్రము అవకాశం లేదు. గుణధనమును మనము పెంచుకోవాలి. విశ్వాసబలమును మనము పెంచుకోవాలి. శరణాగతి అనే తత్వములో మనము జీవితాన్ని సాధించాలి.

అనేకమంది అంటుంటారు. నన్నెందుకింత బాధపెడుతున్నావు? నన్నెందుకింత అవస్థలపాలు చేస్తున్నావు అని భావిస్తుంటారు. నిజముగా శరణాగతుడైన వాడు యీ ప్రశ్నలకే మాత్రం అవకాశము యివ్వడు. నేను శరణాగతి అయినప్పటికిని నన్ను బాధిస్తున్నాడే నన్ను అనేదివుంటున్నప్పుడు యింక శరణాగతి ఎక్కడ వస్తుంది. శరణాగతి చేయనివాడే యిట్టి భావములకు గురయ్యేది. శరణాగతుడైన వానికి అన్ని భగవంతుని యొక్క ప్రసాదములే. కనుక యీ కర్మ కొండను మనము అభివృద్ధిగాంచుకొని, దానిని పవిత్రముగావించుకొని, సార్థకముగావించుకొనే నిమిత్తమై మనము హృదయ విశాలతను చేసుకోవాలి.

కర్మ దాటవశమా నరుడా కర్మ దాటవశమా.
చిన్న చెరువులో ముంచినగాని
ఎన్ని సముద్రములు ముంచినగాని
కడవెంతో రా నీరంతేరా
కావాలన్నను ఎక్కువరాదు ॥కర్మ॥
ఘన పాఠంబులు చదివినగాని
కులదేవతలను కొలచినగాని
కారడవులకే పోయినగాని
కఠిన తపసులే చేసినకాని ॥కర్మ॥.

అయితే యీ కర్మను దాటవశము. ఎట్లా? దైవానుగ్రహాన్ని సాధిస్తే కొండలంతా పిండిగా మారిపోతాయి. అలాంటి అనుగ్రహము ఒక్క దైవత్వములో మాత్రమే యిమిడివుంది. అణుమాత్రమైన అగ్ని పర్వతమంత ప్రత్తిని కూడను ఒక్క క్షణములో భస్మం చేస్తుంది. అయితే యీ అగ్ని యే రీతిగా మనకు లభ్యమవుతుంది. అది ప్రేమ వల్లమాత్రమే లభ్యమౌతుంది. ఆ ప్రేమను మనం పెంచుకోవాలి. ప్రేమతో సేవలు చేయాలి. ఏ సేవలు చేస్తున్నప్పటికి నామస్మరణతో చెయ్యాలి. నామము లేకపోతే యీ మనసు యెక్కడెక్కడకో పరుగెత్తిపోతుంది. ఇది చంచలత్వమునకు పుట్టినిల్లు. పెట్టినది పేరు. కనుక మనము యితర చింతనలకు చోటివ్వకుండా భగవన్నా

ఉచ్చరించుకుంటూ మనము కర్మలలో ప్రవేశించాలి.

దివ్యాత్మస్వరూపులారా! యీనాటి జన్మదినోత్సవమందు తెల్సుకోవలసినది ఆచరించటానికి ప్రయత్నించవలసినది యీనాటినుండి మీరు ప్రారంభించవలసినది మూడు మాత్రమే. ఇతరులను విమర్శించటం మానుకోండి. పరదూషణ అనేది మహాపాపము. పరులను దూషించటమే మహాపాపమనగా పరమాత్మను దూషించుట మరీ పాపము. కనుక మనము దేని యొక్క చెడ్డనుగాని, పరుల యొక్క దోషములుగాని మనము యే మాత్రము విచారించరాదు. అందరినీ ప్రేమతో మనము స్వాగతము చేయాలి. కర్మలలో మనం ప్రవేశించాలి. అవగా విశాలమైన దేశంలో వున్నప్పుడు మనం పల్లెలయందు చేరి పవిత్రమైన సేవలు మనం చేయాలి. నేను చెప్పాను పూర్వమే.

గ్రామసేవ యన్న రామసేవయే సుమ్మా
రామరాజ్యమన్న ప్రేమమయమే
ఇచ్చుకొనుము సేవ పుచ్చుకొనుము ప్రేమ.

ఈ సేవలందు మనము కంకణం కట్టుకొని ప్రవేశించాలి. సమాజసేవ సర్వేశ్వరుని సేవగా విశ్వసించాలి. మరొక్కటి కూడా మీరు నేడు చక్కగా దృష్టియందుంచుకోవాలి. మన సంస్థల పేరుతో వుండిన ఏట్టి కార్యములకు ప్రభుత్వానికి మనకు యేమాత్రం సంబంధము వుండకూడదు. ప్రభుత్వం చేయవలసిన పనులు ప్రభుత్వం చేస్తుంది. ఇవి మన ప్రాప్తి కోసం చేయవలసిన పనులు కనుక స్వయంకృషితో మనము సాధించాలి గాని యితరుల సహాయం మనకక్కరలేదు. మనకు యెంత శక్తో అంత శక్తి చాలు. గొప్పగా మనం చేయనక్కరలేదు.

గంగిగోవుపాలు గరిటెడైనను చాలు
కడవెడైన నేల ఖరముపాలు

కనుక మన సంస్థలు యే సంస్థలైనాసరే ప్రభుత్వముతో సంబంధం లేకుండా వుండటం ఒకటి సమాజములో ప్రవేశించి సేవలు చేయటం రెండవది, మూడవది పరదూషణ లేకుండా వుండటం యివే నిజమైన సాధనలు.

పిల్లలయందుగాని పెద్దలయందుగాని ఎవరియందైనాసరే, యితరులు యెవరైనాగాని ప్రక్కనుండి దూషిస్తూ వుంటే రెండు పెట్టు వాడిని. అది సరైన బుద్ధిగా వస్తుంది. పిచ్చివాడా! నేను వేసిన దెబ్బ నీకోసం కాదు. నా గుణమునకు దెబ్బ కొట్టాను అని చెప్పు. అందరూ వింటూ వుంటే యీ చెప్పేటువంటి వారు యింకా చెప్తూ పోతుంటారు. వారి దూషణలు మనం వింటూ వుంటే వారు చెప్పుకుంటూ వారి దూషణలింకా అభివృద్ధి గావించుకుంటూ పోతుంటారు. మానవుడు శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః అని అమృత పుత్రుడుగా నీవు వున్నావు. నీవు పశువు కాదు. నీవు రాక్షసి కాదు. దానవుడు కాదు. నీవు మానవుడవు. మానవత్వ

ప్రట్టి మానవుని తిరస్కరించటము, మానవుని దూషించటము యిది మహాపాతకము. ఇది మాన
వత్వానికి సరైన సహజగుణము కాదు అని వానికి బుద్ధి చెప్పాలి. ఎందుకోసమనగా నీవు యితరు
లను యెంత దూషించినావో అంతకు పదింతలు దూషించబడతావు మున్ముందు. ఇతరుల
చెడ్డను నీవు యెంత కోరుతూపోతావో అంతకు నూరింతలు చెడ్డ నీకే జరుగుతూవస్తుంది. అది
కూడను జాగ్రత్త. కనుక యెవ్వరిని మనము విసర్జించరాదు. ప్రేమను పెంచుకుంటే యీ
దూషణ భూషణ తిరస్కారములంతా దూరమై పోతాయి. కనుక భగవంతుని స్మరించు
కుంటూ భజించుకుంటూ ప్రేమతో సేవలో పాల్గొని జన్మను సార్థకము చేసుకొని నేనే
దైవత్వమనే దివ్యతత్వము చింతిస్తూరండి. కనుక యెవరికివారు దేవుడుగానే వుంటుండాలి.
దేవుడు ప్రత్యేకముగా ఒక చోట వున్నాడని కాదు. నీవు నీ దేవుడుగానే వుంటున్నావు. నీవు
వేసుకున్న డ్రస్సును చూచి మానవుడని భ్రమిస్తున్నావు. ఈ భ్రమ నీలో వుండినంతవరకు బ్రహ్మ
ను నీవు చూడలేవు. బ్రహ్మను చూడలేకపోటానికి మన భ్రమతే మూలకారణము. భ్రమను దూరము
చేసిన బ్రహ్మ సమీపుడౌతాడు. కనుక భజనలతో భగవంతుని యొక్క నామస్మరణ చేస్తూ కాలము
ను సార్థకము గావించుకోండి. క్షణమైన కూడను మనము అనవసరమైన విషయాలలో ప్రవేశించ
రాదు. నిరంతరము రామ చింతన చేసిన కోతి హనుమంతునిగా మారిపోయాడు. చంచలత్వ
ము కల్గిన కోతి యెంత శాంతస్వరూపుడైనాడు. అందుకోసమే సీత హనుమంతుని వర్ణించింది.
శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు, హనుమంతుడు అని. కనుక అలాంటి శాంతస్వభావ
ము, ఆ గుణవంతులు, ఆ బలవంతును, ఆ దివ్యమైన నామము మనము యీనాడు అనుభవించటానికి
ప్రయత్నించాలి.